# అక్షర దర్బార్

www.aksharadarbar.com


Voice of the people

బుధవారం, 1, జూలై 2026 సంపుటి : 03 సంచిక : 138 పేజీలు : 05 వెల ₹5


## సీఎస్ ను కలిసిన కలెక్టర్



అక్షరదర్బార్, భూపాలపల్లి: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పదవీ బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజును జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ నూతన సీఎస్ సంజయ్ జాజుకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, పరిపాలనాంశాలపై చర్చించారు.




## పరకాల ఆస్పత్రిలో

# ఒకే ఒక్కడు!

### కీలక వైద్యుడిపై వరుస ఆరోపణలు

- ఎంబీబీఎస్ అయినా నేమ్‌ప్లేట్‌పై 'ఎండీ'
- ప్రభుత్వ ఉద్యోగంతో పాటు రెండు ప్రైవేట్ క్లినిక్‌లు
- అధిక డ్యూటీలు, రెఫరల్స్,
- ప్రైవేట్ ప్రాక్టీస్‌పై ప్రశ్నలు

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యం అందించాల్సిన ఓ కీలక వైద్యుడి తీరు ప్రస్తుతం పరకాల పట్టణంలో తీవ్ర చర్చనీయాంశమైంది. పరకాల ప్రభుత్వ ఆసుపత్రిలో కీలక స్థానంలో విధులు నిర్వహిస్తున్న సదరు వైద్యుడు ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కుతూ 'ఒకే ఒక్కడిగా' చలామణి అవుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అర్హతకు మించిన బోర్డులు తగిలించుకోవడం, నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ ప్రాక్టీస్ చేయడం, ఆసుపత్రి ఉన్నతాధికారులను మేనేజ్ చేస్తూ అదనపు డ్యూటీలు క్లెయిమ్ చేసుకోవడం వంటి వరుస అవకతవకలపై ఆసుపత్రి వర్గాలతో పాటు స్థానికంగా తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

- అక్షరదర్బార్, పరకాల

03

# రైతన్నకు 'భరోసా'

- బటన్ నొక్కి నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- తొలి విడతగా 41.37 లక్షల మంది రైతులకు రూ.2,482 కోట్లు
- 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల పంపిణీకి నిర్ణయం
- వ్యవసాయమే మా ప్రాధాన్యతన్న సీఎం

03




## వరంగల్ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

- తేదీ, సమయం మీరే చెప్పండి
- కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు ఎమ్మెల్యే నాయిని సవాల్

02



# నిందితుల్లో భయం కలిగించాలి

- వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్
- దర్యాప్తు అధికారులు, పీపీలు, కోర్టు సిబ్బందికి ప్రశంసా పత్రాల అందజేత

అక్షరదర్బార్ , హనుమకొండ: నేరం చేస్తే కోర్టులో ఖచ్చితంగా శిక్ష పడుతుందనే భయాన్ని నిందితుల్లో కలిగించినప్పుడే నేరాలు తగ్గుముఖం పడతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో నిందితులకు కోర్టు ద్వారా శిక్షలు పడేలా చేయడంలో ప్రతిభ కనబరిచిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు (పీపీలు), దర్యాప్తు అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లను సీపీ ప్రత్యేకంగా అభినందించారు. మంగళవారం వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు.

**41 కేసుల్లో నిందితులకు శిక్షలు..**

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. గత ఏడాది జూలై నుండి నేటి వరకు వరంగల్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 41 కేసుల్లో నిందితులకు కోర్టులు శిక్షలు విధించాయని తెలిపారు. ఇందులో ప్రధానంగా చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన జంట హత్యల కేసులో నిందితుడికి కోర్టు ఉరిశిక్ష విధించిందని గుర్తుచేశారు. వీటితో పాటు పలు కేసుల్లో యావజ్జీవ కారాగార శిక్షలతో పాటు, మరికొన్ని కేసుల్లో 20 ఏళ్ల కఠిన శిక్షలు కూడా ఖరారయ్యాయని వివరించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమిష్టి కృషి వల్లే నిందితులకు శిక్షలు పడే శాతం (కన్విక్షన్ రేటు) 7 శాతానికి పెరిగిందని సన్‌ప్రీత్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల నిర్వహించిన లోక్ అదాలత్‌లోనూ అధికారులు అత్యధిక కేసులను పరిష్కరించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, ప్రాసిక్యూషన్ జాయింట్ డైరక్టర్ రాము, ఏసీపీలు దేవిడ్‌రాజు, సతీష్‌బాబు, సదయ్య పాల్గొన్నారు.




# సఫాయి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- సోదా రామకృష్ణ

పరకాల, జూన్ 30 (అక్షరదర్బార్): సఫాయి కార్మికులకు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాలను పూర్తిగా రద్దు చేసి, నేరుగా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని ఆల్ ఇండియా సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది. ఈ మేరకు నేషనల్ కమిషన్ ఫర్ సఫాయి కర్మచారీస్ వైస్ చైర్‌పర్సన్ హార్దిప్ సింగ్‌ను కలిసి ఒక వినతిపత్రాన్ని అందజేసింది. సఫాయి కార్మికుల వేతనాలు, ఉద్యోగ భద్రత, సంక్షేమంతో పాటు వారి పిల్లల విద్యకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లించేలా విధానాన్ని అమలు చేయాలని కోరింది. ఈ కార్యక్రమంలో యూనియన్ జాతీయ కార్యదర్శి సోదా రామకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ పరచ, కారం వీర్ సింగ్, దేవేందర్ సింగ్ చిండాలియా పాల్గొన్నారు.

# ఆర్ అండ్ బీ ఎస్ఈగా సురేష్ బాబు



అక్షరదర్బార్, హనుమకొండ: రహదారులు, భవనంల శాఖ హనుమకొండ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ)గా పి సురేష్ బాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం హనుమకొండ జిల్లా రహదారులు, భవనంల అధికారిగా కొనసాగుతున్న సురేష్ బాబు ఎస్ఈగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లోని ప్రజా ప్రతినిధులు , ఉన్నతాధికారులు, ఇంజనీర్లు, కాంట్రాక్టర్లను సమన్వయం చేసుకొని రహదారులు, భవనముల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు

# జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంఆర్ఐ సేవలు

- హైదరాబాద్ నుండి వర్చువల్ విధానంలో ప్రారంభించిన సీఎం ఎ రేవంత్ రెడ్డి
- కలెక్టర్, ఎమ్మెల్యే, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ యాజమాన్యానికి అభినందనలు



అక్షరదర్బార్, భూపాలపల్లి: ప్రజలకు అత్యాధునిక, నాణ్యమైన వైద్య సేవలను అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన అత్యాధునిక ఎంఆర్ఐ యంత్రాన్ని మంగళవారం హైదరాబాద్ సీఎం కార్యాలయం నుండి వర్చువల్ విధానంలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు, ట్రేడ్ ప్రమోషన్ కార్పోరేషన్ చైర్మన్ ఐతా ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ జిల్లా స్థాయిలోనే ఎంఆర్ఐ సౌకర్యం అందుబాటులోకి రావడం వల్ల పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. గతంలో ఇలాంటి ఖరీదైన వైద్య పరీక్షల కోసం పేదలు వరంగల్, హైదరాబాద్ వంటి సుదూర నగరాలకు వెళ్లాల్సి వచ్చేదని, దీనివల్ల వారికి సమయం, డబ్బు వృధా అయ్యేవని తెలిపారు. ఇప్పుడు స్థానికంగానే ఈ సేవలు అందుబాటులోకి రావడం వల్ల సకాలంలో ఖచ్చితమైన వ్యాధి నిర్ధారణ జరిగి, మెరుగైన వైద్యం అందుతుందిని తెలిపారు. ప్రజా వైద్య సేవల బలోపేతానికి సీఎస్ఆర్ నిధులతో ఎంఆర్ఐ యంత్రాన్ని ఏర్పాటు చేయుటకు ప్రత్యేక చొరవ చూపిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను, స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును, ఇందుకు సహకరించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ యాజమాన్యాన్ని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ హెచ్‌డీఎఫ్‌సీ సీఎస్ఆర్ నిధుల భాగస్వామ్యంతో ఈ అత్యాధునిక యంత్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన ఆసుపత్రి నుండి పర్యవేక్షకులు డా రాజేంద్రప్రసాద్, జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా వెంకటేశ్వర్లు, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, డిప్యూటీ సూపరింటెండెంట్ డా వెంకటరత్నం, కౌన్సిలర్లు, హెచ్ డీఎఫ్ సీ జోనల్ హెడ్ జోష్ స్టెఫిన్, క్లస్టర్ హెడ్ రాజేష్ వైద్యులు, సిబ్బంది, ఇతర ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

- తేదీ, సమయం మీరే చెప్పండి
- కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు ఎమ్మెల్యే నాయిని సవాల్



అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్‌లో జరిగిన బీజేపీ సభలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా వాస్తవాలకు దూరంగా ఉన్నాయని, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే వారు యత్నిస్తున్నారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ వైఖరిపై నిప్పులు చెరిగారు. వరంగల్ అభివృద్ధిపై బీజేపీ నేతలకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ప్రజల సమక్షంలో బహిరంగ చర్చకు రావాలని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు ఎమ్మెల్యే నాయిని సవాల్ విసిరారు. "చర్చకు తేదీ, సమయం మీరే నిర్ణయించండి... కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉంది. వరంగల్‌కు ఎవరు ఏం చేశారో ప్రజల ముందే తేల్చుకుందాం" అని స్పష్టం చేశారు. పదేళ్లపాటు బీఆర్ఎస్‌తో ప్రత్యక్ష, పరోక్ష రాజకీయ అనుబంధం కొనసాగించిన బీజేపీ, తెలంగాణకు ఏం సాధించిందో ముందు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

– ఎయిర్‌పోర్టుకు రూ.300 కోట్లు ఇచ్చింది రేవంత్ రెడ్డి ప్రభుత్వమే మామునూరు విమానాశ్రయ భూసేకరణ కోసం రూ.300 కోట్ల భారీ నిధులను కేటాయించి, ఆ ప్రక్రియను వేగవంతం చేసింది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే గుర్తుచేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మార్పు ప్రత్యక్షంగా కనిపిస్తోందని, అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

**అవి మీ జేబు నిధులు కావు.. ప్రజల పన్నుల సొమ్ము**

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే నిధులు బీజేపీ నాయకుల సొంత సొమ్ము కాదని, దేశ ప్రజలు కష్టపడి చెల్లించే పన్నుల ద్వారా వచ్చేవేనని నాయిని స్పష్టం చేశారు. బీజేపీ పాలనలో జరిగిన పేపర్ లీకేజీల వల్ల లక్షలాది మంది నిరుద్యోగుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడిందని మండిపడ్డారు. వరంగల్ అభివృద్ధిని అడ్డుకున్న చరిత్ర బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలదేనని దుయ్యబట్టారు. తెలంగాణకు కేంద్రం చేసిన అన్యాయాలపై సమాధానం చెప్పకుండా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమేనని హితవు పలికారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే వరంగల్ అభివృద్ధి కొత్త వేగాన్ని అందుకుందని, విమర్శలు చేసే ముందు తమ పదేళ్ల పాలనలో తెలంగాణకు సాధించిన ఒక్క ప్రధాన అభివృద్ధి పనినైనా చూపించాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి డిమాండ్ చేశారు.

# గీతాంజలి పాఠశాలలో అట్టహాసంగా ఫ్రెషర్స్ డే వేడుకలు





నర్సంపేట, జూన్ 30 (అక్షర దర్బార్): నర్సంపేట పట్టణంలోని గీతాంజలి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో మంగళవారం ఫ్రెషర్స్ డే వేడుకలను పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వేములపల్లి సుబ్బారావు జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. ఒక నిర్దిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగే విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాన్ని కైవసం చేసుకుని తల్లిదండ్రులకు ఆనందాన్ని ఇస్తారని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాజేష్ మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం దైవ ప్రార్థన చేయడం వల్ల విద్యార్థులలో విలువలతో కూడిన విద్యా క్రమశిక్షణ అలవడుతుందని, వారు సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని తెలిపారు. ఈ వేడుకల్లో విద్యార్థుల నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు తల్లిదండ్రులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

**సభ్యుల అనుమతి లేకుండా పంచాయతీ**

# నిధుల విత్‌డ్రాపై డీపీఓకు వినతి

శాయంపేట, జూన్ 30 (అక్షర దర్బార్) : శాయంపేట గ్రామపంచాయతీలో కనీస తీర్మానం, వార్డు సభ్యుల సంతకాలు లేకుండా సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శి నిధులు డ్రా చేస్తున్నారని ఆరోపిస్తూ 13 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా హనుమకొండ డీపీఓ, శాయంపేట ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలోనూ సర్పంచ్ వార్డు సభ్యులను సంప్రదించకుండా సొంత నిర్ణయాలు తీసుకుంటున్నారని మండిపడ్డారు. దీనిపై ఎంపీడీవో స్పందిస్తూ, ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శి ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్) విధుల్లో ఉన్నారని, తిరిగి పూర్తిగా విధుల్లో చేరేవరకు పంచాయతీ నుండి ఎలాంటి ఆర్థిక లావాదేవీలు జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కూరాకుల మంజుల రవి, కోలా సుజాత, చెలుపూరి బంటి, ఉప్పు రంజిత్ పాల్గొన్నారు.






## పరకాల ఆస్పత్రిలో

# ఒకే ఒక్కడు!

- కీలక వైద్యుడిపై వరుస ఆరోపణలు
- ఎంబీబీఎస్ అయినా నేమ్‌ప్లేట్‌పై 'ఎండీ'
- ప్రభుత్వ ఉద్యోగంతో పాటు రెండు ప్రైవేట్ క్లినిక్‌లు
- అధిక డ్యూటీలు, రెఫరల్స్, ప్రైవేట్ ప్రాక్టీస్‌పై ప్రశ్నలు

### అర్హత ఎంబీబీఎస్.. బోర్డుపై మాత్రం 'ఎండీ'

సదరు వైద్యుడి విద్యా అర్హత కేవలం ఎంబీబీఎస్ మాత్రమే అయినప్పటికీ, ఆయన తన నేమ్‌ప్లేట్‌పై మాత్రం 'ఎండీ' అని రాసుకోవడం స్థానికంగా చర్చకు దారితీసింది. ఇది రోగులను తప్పుదోవ పట్టించడమేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రభుత్వ వైద్యుడిగా విధులు నిర్వహిస్తూనే, పట్టణంలో ఏకంగా రెండు ప్రైవేట్ క్లినిక్‌లు నిర్వహిస్తుండటం గమనార్హం. అంతేకాకుండా, ఆయన భార్య కూడా అదే ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యురాలిగా పనిచేస్తూ, మరోవైపు సొంత క్లినిక్ నడుపుతున్నట్లు సమాచారం. ప్రభుత్వ వైద్యులు ప్రైవేట్ ప్రాక్టీస్ చేయరాదనే నిబంధనలు ఉన్నప్పటికీ.. ఇక్కడ మాత్రం అవి కాగితాలకే పరిమితమయ్యాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**అక్షరదర్బార్, పరకాల:**

**ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యం అందించాల్సిన ఓ కీలక వైద్యుడి తీరు ప్రస్తుతం పరకాల పట్టణంలో తీవ్ర చర్చనీయాంశమైంది. పరకాల ప్రభుత్వ ఆసుపత్రిలో కీలక స్థానంలో విధులు నిర్వహిస్తున్న సదరు వైద్యుడు నిబంధనలను తుంగలో తొక్కుతూ 'ఒకే ఒక్కడిగా' చలామణి అవుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.**

### నెలకు 60కి పైగా అదనపు డ్యూటీలు..

ఆస్పత్రి వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం.. సదరు కీలక వైద్యుడికి నెలకు ఏకంగా 60కు పైగా అదనపు డ్యూటీలు కేటాయిస్తున్నట్లు తెలుస్తోంది. మిగిలిన వైద్యులకు లేని ఈ 'ప్రత్యేక అవకాశం' ఈ ఒక్కరికే ఎలా దక్కుతోందని ఆస్పత్రి సిబ్బందే గుసగుసలాడుకుంటున్నారు. ఆస్పత్రికి ఏ సూపరింటెండెంట్ వచ్చినా వారితో అత్యంత సన్నిహితంగా ఉంటూ, తనకు అనుకూలంగా డ్యూటీలు వేయించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### - ప్రైవేట్ క్లినిక్‌లకే రెఫరల్స్..

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే కొందరు పేద రోగులను ఇక్కడి సౌకర్యాలు లేవనే సాకుతో బయట పరీక్షలకు, ప్రైవేట్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నట్లు గతంలోనూ ఆరోపణలు వచ్చాయి. శస్త్రచికిత్సలకు అత్యంత కీలకమైన 'అవిల్' ఇంజక్షన్ సదరు వైద్యుడి సొంత క్లినిక్‌లోనే లభ్యం కావడం వెనుక ఉన్న మతలబు ఏమిటనే ప్రశ్న ఉత్పన్నం అవుతుంది.

### విచారణ జరిపితేనే నిజాలు బయటకి..

పరకాల ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంతో మంది వైద్యులు బదిలీలపై వస్తూ, వెళ్తున్నా.. ఈ కీలక వైద్యుడు మాత్రం ఏళ్లుగా ఇక్కడే తిష్ట వేయడం వెనుక ఉన్న రహస్యం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ వరుస ఆరోపణలపై సంబంధిత వైద్యుడు, ఆస్పత్రి సూపరింటెండెంట్, అలాగే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి, ఉన్నత స్థాయి విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని స్థానికులు కోరుతున్నారు.

## మేడారం అభివృద్ధి, పారిశుధ్య పనులను వేగవంతం చేయాలి: కలెక్టర్

ములుగు, జూన్ 30 (అక్షర దర్బార్) : మేడారం జాతర అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు పారిశుధ్య నిర్వహణ, వన మహోత్సవ కార్యక్రమాలను సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం మేడారం హరిత హోటల్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మేడారం పరిసర ప్రాంతాలలో అటవీ శాఖ నర్సరీల నుండి మొక్కలను తెచ్చి విస్తృతంగా నాటాలన్నారు. భక్తులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్, ఎం. సంపత్ రావు, మేడారం పూజారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.






# రైతన్నకు 'భరోసా'

- బటన్ నొక్కి నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- తొలి విడతగా 41.37 లక్షల మంది రైతులకు రూ.2,482 కోట్లు
- 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల పంపిణీకి నిర్ణయం
- వ్యవసాయమే మా ప్రాధాన్యతన్న సీఎం

అక్షరదర్బార్, హైదరాబాద్ : రాష్ట్ర రైతాంగానికి పెట్టుబడి సాయంగా తెలంగాణ ప్రభుత్వం మంగళవారం 'రైతు భరోసా' నిధులను విడుదల చేసింది. హైదరాబాద్ శిల్పకళా వేదికగా అత్యంత వైభవంగా జరిగిన రైతు భరోసా సదస్సులో ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి కంప్యూటర్ మీట నొక్కి ఈ నిధులను నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేశారు. వచ్చే 9 రోజుల్లో మొత్తం రూ.9 వేల కోట్లను విడుదల చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఉంది. ఇందులో భాగంగా తొలి విడతగా రాష్ట్రంలోని 41.37 లక్షల మంది రైతుల ఖాతాల్లో నిధులను జమ చేయడానికి వీలుగా రూ.2,482.02 కోట్లను సీఎం విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1600 రైతు వేదికల ద్వారా రైతాంగం లైవ్‌లో వీక్షిస్తుండగా ఈ నిధుల విడుదల కార్యక్రమం సాగింది. శిల్పకళా వేదికలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్‌లతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### వ్యవసాయమే మా శ్వాసం..

ఈ సందర్భంగా రాష్ట్ర రైతాంగాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవేశపూరితంగా మాట్లాడారు. "గడిచిన 30 నెలలుగా సమాజంలో గౌరవం పెంచుకుంటూ, గత పాలనలో విధ్వంసమైన రాష్ట్రాన్ని వికాసం వైపు నడిపించుకుంటూ వెళుతున్నాం" అని పేర్కొన్నారు. వ్యవసాయాన్ని పండుగ చేయాలన్నదే తమ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని చెప్తూ, ఈ రంగానికి చేసిన ఖర్చు గణాంకాలను సీఎం వివరించారు.

### వ్యవసాయ రంగానికి ప్రజా ప్రభుత్వ అండ

గడిచిన 30 నెలల కాలంలో వ్యవసాయ రంగానికి రూ.1.75 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు సీఎం వెల్లడించారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 25.35 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు (మొత్తం రూ. 20,677 కోట్లు) రుణాల మాఫీ చేశాం. గత ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.7 వేల కోట్లతో పాటు, తాజాగా విడుదల చేసిన నిధులతో కలిపి ఇప్పటివరకు రైతు భరోసా కింద రూ. 36 వేల కోట్లు చెల్లించాం. పండించిన పంటలకు బోనస్‌గా రూ. 4 వేల కోట్లు, వ్యవసాయ పనిముట్ల కోసం రూ. 2 వేల కోట్లు, బీమా కోసం రూ. 3.5 వేల కోట్లు చెల్లించాం. గడిచిన రెండున్నరేళ్లలో వడ్ల కొనుగోలు కోసం రూ. 80 వేల కోట్లకు పైగా చెల్లించామని రేవంత్ రెడ్డి అన్నారు. "తెలంగాణ రైతాంగం కష్టపడి 2.88 కోట్ల మెట్రిక్ టన్నుల వడ్లు పండించి దేశంలోనే నంబర్ 1 స్థానంలో నిలిచింది. విశేషం ఏంటంటే.. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చుక్క నీరు వాడకుండానే రైతులు ఈ అద్భుత ఉత్పత్తిని సాధించారు" అని ముఖ్యమంత్రి ప్రకటించారు.

## బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన కాట్రపల్లి గిరిజన విద్యార్థిని వైష్ణవి

శాయంపేట, జూన్ 30 (అక్షర దర్బార్): మారుమూల గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి ప్రతిభ చాటింది. శాయంపేట మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు వాంకుడోత్ రవి, సుజాతల కూతురు వైష్ణవి పదో తరగతిలో 563 మార్కులతో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. పెద్దాపూర్ ఎంజేపీ పాఠశాలలో పదో తరగతి వరకు చదివిన వైష్ణవి, తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుంటూ తనిని చదివించారని తెలిపింది. బాసరలో సీటు రావడంపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేయగా, బాగా చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తెస్తానని వైష్ణవి పేర్కొంది. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఉపాధ్యాయులు వైష్ణవిని ప్రత్యేకంగా అభినందించారు.



## పరకాల బైపాస్ ప్రతిపాదనను విరమించుకోవాలి

**ఇంగిలి వీరేష్ రావు**



పరకాల, జూన్ 30 (అక్షరదర్బార్): గూడెప్పాడు–భూపాలపల్లి మధ్య నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారి–353సీని పరకాల పట్టణం గుండానే నిర్మించాలని, బైపాస్ ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు ఇంగిలి వీరేష్ రావు డిమాండ్ చేశారు. మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, బైపాస్ రహదారి నిర్మాణం వల్ల పట్టణ వ్యాపారులు, ప్రజలు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ సమయంలోనే పరకాలకు అన్యాయం జరిగిందని, ఇప్పుడు రహదారిని పట్టణం వెలుపలికి మళ్లిస్తే అభివృద్ధి పూర్తిగా దెబ్బతింటుందని పేర్కొన్నారు. వందలాది వ్యాపార కుటుంబాల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని రోడ్డును పట్టణం మీదుగానే విస్తరించాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# అరణ్య బాట పట్టి

### గుత్తికోయ పిల్లలకు పోలియో చుక్కలు వేసిన వైద్య సిబ్బంది

వెంకటాపూర్, జూన్ 30 (అక్షర దర్బార్) : పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా వెంకటాపూర్ పరిధిలోని రవాణా సౌకర్యం లేని గిరిజన ఆవాసాలైన తొర్రి చింతలపాడుకు వైద్య సిబ్బంది నడక మార్గాన వెళ్లి ఐదు సంవత్సరాల లోపు వయసు కలిగిన 15 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. వెంకటాపూర్ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ శ్రీకాంత్ మాట్లాడుతూ మండలంలో రవాణా లేనటువంటి రోలు బండ, బండ్లపాడు, చాకిరేవులు, నందిపాడు గూడాలలోని 85 మంది చిన్నారులకు చుక్కలు వేశామన్నారు. మూడు రోజుల ఈ పోలియో కార్యక్రమంలో మండల పరిధిలోని 10,200 గృహాలను సందర్శించి, మొత్తం 2,438 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసి 100 శాతం లక్ష్యాన్ని సాధించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు మోతిలాల్, సుశీల పాల్గొన్నారు.



## మంత్రి కొండా సురేఖ నివాసాన్ని ముట్టడించిన మున్సిపల్ కార్మికులు

పరకాల, జూన్ 30 (అక్షరదర్బార్): సీఐటీయూ ఆధ్వర్యంలో పరకాల మున్సిపాలిటీ కార్మికులు అధ్యక్షుడు మడికొండ ప్రమోద్ కుమార్ నాయకత్వంలో హనుమకొండలోని మంత్రి కొండ సురేఖ నివాసాన్ని ముట్టడించారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయాలని, ఉద్యోగాలను శాశ్వతీకరించాలని, ఇందిరమ్మ ఇళ్లలో ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆందోళన సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కొండ మురళీధర్ రావు కార్మికులతో మాట్లాడి, వారి సమస్యలను మంత్రి సురేఖతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు టి. ఉప్పలయ్య, బొట్ల చక్రపాణి, బొచ్చు ఐలయ్య పాల్గొన్నారు.



## సోషలిస్టు ఆర్థిక వ్యవస్థే సకల సమస్యలకు పరిష్కారం

**అశోక్ ఓంకార్**

వరంగల్, జూన్ 30 (అక్షర దర్బార్): ప్రస్తుత ప్రపంచ పరిణామాలలో పతనమవుతున్న కార్పొరేట్ ఆర్థిక వ్యవస్థకు సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ మాత్రమే సరైన ప్రత్యామ్నాయమని ఎంసీపీఐ (యూ) అఖిలభారత ప్రధాన కార్యదర్శి మద్ది కాయల అశోక్ ఓంకార్ అన్నారు. మంగళవారం వరంగల్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్) పేరిట ప్రజాస్వామ్య వ్యవస్థను కూని చేసేందుకు కుట్ర చేస్తోందని విమర్శించారు. కాగా, గత ఎనిమిదేళ్లుగా విడివిడిగా పనిచేస్తున్న పార్టీ శ్రేణులు జూన్ 29న జరిగిన రాష్ట్ర సదస్సు ద్వారా వరంగల్‌లో ఏకీకృతమయ్యాయని, పార్టీ నూతన రాష్ట్ర కార్యదర్శిగా గాదగోని రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని వెల్లడించారు. ఈ సమావేశంలో వల్లెపు ఉపేందర్ రెడ్డి, మోర్తాల చందర్ రావు, పెద్దారపు రమేష్ పాల్గొన్నారు.




## రాంనగర్ కాలనీలో పోలీసుల కార్డెన్ అండ్ సెర్చ్

○ 20 బైకులు జప్తు

చిట్యాల, జూన్ 30 (అక్షర దర్బార్) : జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు చిట్యాల మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీలో మంగళవారం తెల్లవారుజామున సీఐ డి. మల్లేష్ ఆధ్వర్యంలో కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. తనిఖీలలో భాగంగా కాలనీలోని ప్రతి ఇల్లును సోదా చేసి, ఎలాంటి పత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలకు జరిమానా విధించారు. అలాగే అక్రమ మద్యంపై జరిగిన సోదాల్లో ఓర్సు సరమ్మ అనే మహిళ నుండి 5 లీటర్ల గుడుంబాను (నాటు సారా) స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పోచంపల్లి సతీష్ తెలిపారు. సమాజంలో నేరాల నియంత్రణకు, ప్రజల్లో భద్రతా భావాన్ని పెంచడానికే ఈ తనిఖీలు చేపట్టామని సీఐ పేర్కొన్నారు. అనంతరం 'అరైవ్ అలైవ్', గోల్డెన్ అవర్, సైబర్ క్రైమ్స్, సీసీ కెమెరాల ప్రాధాన్యత మరియు డ్రగ్స్ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ ఆపరేషన్‌లో ఎస్ఐ సతీష్, సెకండ్ ఎస్ఐ రజన్ కుమార్, 18 మంది పోలీసులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ ఫ్లెక్సీ కటౌట్ ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

చిట్యాల, జూన్ 30 (అక్షర దర్బార్) : ఘన్‌పూర్ మండలం గాంధీనగర్ కూడలి జంక్షన్ వద్ద బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం వేసుకున్న ఫ్లెక్సీ కటౌట్‌ను ట్రాక్టర్ తో ఢీకొట్టి ధ్వంసం చేసిన మంకు శ్రీకాంత్‌ను తక్షణమే అరెస్టు చేయాలని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య, బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ జిల్లా నాయకుడు పుల్ల అశోక్ డిమాండ్ చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ మంగళవారం చిట్యాల మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. దోషులను కఠినంగా శిక్షించకపోవడం వల్లే ఇలాంటి దాడులు జరుగుతున్నాయని, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోకపోతే దళిత సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసనలో జన్నె యుగంధర్, గురుకుంట్ల కిరణ్, పర్లపల్లి వంశీ పాల్గొన్నారు.



## మద్దులపల్లిలో వెదురు మొక్కల పెంపకంపై రైతులకు అవగాహన

కాళేశ్వరం, జూన్ 30 (అక్షర దర్బార్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో రైతులకు వెదురు మొక్కల పెంపకంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన ఐకేపీ ఏపీఎం రాజన్న, సీసీ శశికాంత్ మాట్లాడుతూ రైతులు తమ భూముల్లో వెదురు మొక్కలను నాటడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. వెదురు మూడు సంవత్సరాలలో కోతకు వస్తుందని, 15 గుంటల విస్తీర్ణానికి ప్రతి సంవత్సరం ప్రభుత్వమే నిర్వహణ ఖర్చుగా రూ. 15 వేలు అందిస్తుందని వివరించారు. దీనివల్ల రైతులకు ఏడాదికి సుమారు రూ. 50 వేల వరకు ఆదాయం లభిస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సరిత, ఉపసర్పంచ్ లచ్చిరెడ్డి పాల్గొన్నారు.



## విద్యుత్ వైర్లతో చేపలు పడితే కఠిన క్రిమినల్ చర్యలు: సీఐ మల్లేష్

చిట్యాల, జూన్ 30 (అక్షర దర్బార్) : వాగులు, వంకలు లేదా చెరువులలో విద్యుత్ వైర్లను ఉపయోగించి చట్టవిరుద్ధంగా చేపలు పడితే కఠిన చర్యలు తప్పవని చిట్యాల సీఐ డి. మల్లేష్ తీవ్రంగా హెచ్చరించారు. మంగళవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ విద్యుత్ లైన్ల నుండి అక్రమంగా కరెంట్ కనెక్షన్లు తీసుకోవడం ప్రాణాంతకమని, అది తీవ్రమైన చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో భూమి తడిగా ఉండి ఎర్తింగ్ అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున, ప్రజలు ఎవరైనా సరే విద్యుత్ లైన్ల వద్ద అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ప్రాణాలను పణంగా పెట్టి చేపలు పట్టవద్దని కోరారు.

